క్లుప్తంగా

రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలి

పెనుబల్లి: రైతుల కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి ఏడీఏ యూ.నరసింహారావు అన్నారు. మంగళవారం పెనుబల్లి ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల నమోదు, రైతుబీమా నమోదులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కొత్తగా పాసుపుస్తకం పొందిన 18–59 మధ్య వయస్సు ఉన్న రైతుల ఏఈఓల వద్ద రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని, పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నామిని మార్పుల, చేర్పులకు ఈ నెల 31లోపు చేసుకోవాలన్నారు. ఏఈఓలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వేంసూరు: కొత్తగా పాసుపుస్తకం పొందిన 18–59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతుల ఏఈఓల వద్ద రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పి.రాంమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీల సమావేశం

కల్లూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యాన కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూళ్ల హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీల సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు పీఈటీ పి.వీరరాఘవయ్య తెలిపారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో మండల, జోనల్ స్థాయి క్రీడాపోటీలపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయుల నియామకం

ముదిగొండ: మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం, యడవల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లు అప్‌గ్రేడ్ కావడంతో ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు మంగళవారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడింది. స్కూల్ అసిస్టెంట్, ఇంగ్లీష్, గణితం, సోషల్ స్టడీస్, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, స్కూల్‌అసిస్టెంట్ హిందీ పండిట్‌లను డిప్యూటేషన్‌లపై నియమించినట్లు ఎంఈఓ బీవీ రామాచారీ తెలిపారు.

ఎస్సైగా పదోన్నతి

బోనకల్: బోనకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండేళ్లుగా ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దారెల్లి బాలస్వామి ఎస్సైగా పదోన్నతి పొందారు. ఈ మేరకు పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఆయన వెళ్లనున్నారు. ఈ సందర్భంగా బాలస్వామికి పదోన్నతి రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ రిజిస్ట్రేషన్ బాధితుల సమావేశం

మధిర: మధిర పట్టణంలోని వైరా రోడ్డులో ఉన్న ద్విచక్ర వాహనాల షోరూం నుంచి వాహనాలను కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మంగళవారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు సమావేశమయ్యారు. కొనుగోలు చేసిన వాహనాలకు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో తనిఖీలు చేపట్టినప్పుడు, పక్క రాష్ట్రానికి వెళ్లినప్పుడు పేపర్లు లేకపోవడంతో జరిమానా కట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా షోరూం నిర్వాహకులు స్పందించి వాహనదారులకు వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు.

శాంతినగర్‌లో ఫాగింగ్

కల్లూరు: పట్టణంలోని శాంతినగర్‌లో మంగళవారం ఫాగింగ్ చేశారు. ఎంపీడీఓ కె.చంద్రశేఖర్, ఎంపీటీసీ కొండూరు కిరణ్‌లు మాట్లాడుతూ... దోమలు, ఈగలు చేరి ప్రజల అనారోగ్యం పాలు కాకుండా ముందు జాగ్రత్తగా స్ప్రే చేయిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశమైన నాయకులు

కల్లూరు: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసమే ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. కల్లూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు సమావేశమైన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయాన కాంగ్రెస్‌ను వదిలి వేరే పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసిన వారి మళ్లీ రావాలని చూస్తున్నారని తెలిపారు. అంతే కాక ఎవరికి వారే పదవులు ప్రకటించుకుని వాట్సాప్ గ్రూప్‌ల్లో పెడుతున్నారన్నారు. అయితే, పదవుల విషయంలో ఎమ్మెల్యే నిర్ణయమే శిరోధార్యమన్నారు. పసుమర్తి చందర్‌రావు, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్‌రావు, ఎస్.కే.యాకూబ్ అలీ, ఆళ్లకుంట నర్సింహారావు, పెద్దబోయిన శ్రీను, శ్రీకాంత్, ఎస్‌కే.బాజీ, బైర్ల కాంతారావు, దామాల రాజు, తోట సుబ్బారావు, తురాబల్లి, ఎస్‌కే.ఉస్మాన్, నల్లగట్ల కిషోర్, దామాల సురేష్ పాల్గొన్నారు.

జ్వరమే పెట్టుబడి..!



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు వచ్చిన స్థానికులు

ప్రైవేట్ వైద్యంతో జేబుకు చిల్లు

- టెస్టుల పేరుతో దండుకుంటున్న వైనం
- లక్షణాలు లేకున్నా రక్తపరీక్షలు చేస్తూ దోపిడీ
- వచ్చీ రాని వైద్యంతో చెలగాటం..

పేద, మధ్య తరగతి ప్రజలకు వచ్చే జ్వరాలే కొందరికి పెట్టుబడిగా మారింది. జ్వరం పేరు చెప్పుకుని అందిన కాడికి గుంజుకుంటున్నారు. అసలే జ్వరాలతో పల్లెలు, పట్టణాలు వణికిపోతున్నాయి. ఒళ్లు, కీళ్ల నొప్పులు, ఎర్రటి దద్దుర్లతో జ్వర పీడితులు ఆస్పత్రులపాలవుతున్నారు. సత్తుపల్లి డివిజన్‌లో జ్వరాల తీవ్రత మరింతగా పెరిగి ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి.

– సత్తుపల్లి

సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఓపీ 350 దాటుతోంది. వీటిలో 200 మందికిపైగా జ్వరపీడితుల కేసులే నమోదవుతున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీలు లేవని బయట నుంచి బయటకే పంపేస్తున్నారు. అధికారికంగా ఏ ఒక్క డెంగీ కేసు నమోదు కాకపోయినా చాలా ఆస్పత్రుల్లో డెంగీ జ్వరలక్షణాల పేరుతో రోగులను పీల్చి పిప్పి చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ జబ్బుకు ఎంత ఫీజు తెలిపే కనీస సమాచార సిటిజన్ ఛార్టర్ చాలా ఆస్పత్రుల్లో కనిపించని పరిస్థితి ఉంది. కొన్ని ఆస్పత్రుల్లో శిక్షణలేని, వైద్యంపై అవగాహన లేని నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహించటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

పరీక్షలతో జేబులకు చిల్లు..

ఖమ్మం తర్వాత సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంలోనే అత్యధిక ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. వైద్యం కోసం నిత్యం చుట్టుపక్కల గ్రామాల నుంచి కనీసం వెయ్యి మందికిపైగా ఆస్పత్రులకు వస్తుంటారు. జ్వరం వచ్చిందంటే ముందు పరీక్షలు చేయించుకునేందుకు భయపడాల్సిన పరిస్థితి ఉంది. ప్లేట్‌లెట్స్ పడిపోయాయని, డెంగీ, చికన్‌గున్యా వంటి లక్షణాలు ఉన్నాయంటూ భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు గుంజుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొంత మంది ల్యాబ్ సిబ్బంది అయితే పరీక్షలు చేయకుండానే తమకు తోచిన విధంగా రిపోర్టులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వైద్య పరీక్షలతో కమీషన్లు ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే అవసరం లేకపోయిన రక్త పరీక్షలతో రోగులను పీడిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కొంతమంది వైద్యుల నిర్వాహకంతో..

ఒకరిద్దరు ప్రైవేట్ డాక్టర్ల నిర్వాహకం కారణంగా వైద్యులకు అపవాదును మూటకట్టుకోవాల్సి వస్తోందంటూ ఓ వైద్యుడు వాపోయారు. వైద్య వృత్తినే దైవంలా భావించి, సామాజిక సేవ కోణంలో చేసే వైద్యులు చాలా మంది ఉన్నారన్నారు. వచ్చిరాని వైద్యంపై ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచనలు చేస్తున్నారు.

మెడికల్‌షాపుల్లో వైద్యం..



మర్లపాడులో మెడికల్‌షాపు వెనుక చికిత్స పొందుతున్న వారు..

మెడికల్‌షాపుల్లో ప్రైవేట్ వైద్యం హద్దులు దాటుతోంది. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టి.సీతారాం సోమవారం వేంసూరు మండలం మర్లపాడులో ఆకస్మిక తనిఖీ నిర్వహించగా ఓ మెడికల్‌షాప్‌ని ఆస్పత్రిలా నడుపుతూ వైద్యం చేస్తున్న తీరు విస్మయాన్ని కలిగించింది. ఫార్మసీ సర్టిఫికెట్‌తో ఏకంగా వైద్యుడి అవతారమెత్తి వైద్యం చేయటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే తరహాలో పలుచోట్ల మెడికల్‌షాపుల్లో వైద్యం జరగటం చర్చానీయాంశమైంది. ఇంకొందరైతే పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తూ దర్జాగా కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కులతోనే కొన్ని ఆస్పత్రులు నడుస్తున్నాయని ఇద్దరు కలిసి రోగుల జేబులకు చిల్లులు పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిత్యం తనిఖీలు చేస్తాం..



ఆస్పత్రుల్లో వైద్య సేవలపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తాం. అర్హత లేని వైద్యం చేసేవారిపై కఠినంగానే వ్యవహరిస్తాం. రోగులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటాం. జ్వరాలపై ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తున్నాం. డెంగీ కేసులు నమోదు కాలేదు.

– టి.సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

నాణ్యమైన భోజనం అందించాలి

- డీఈఓ సోమశేఖర శర్మ



కొణిజర్ల : బస్వాపురం కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ

కొణిజర్ల/చింతకాని: విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ సోమశేఖరశర్మ ఆదేశించారు. కొణిజర్ల మండలం బస్వాపురం, చింతకాని మండలం లచ్చగూడెంలోని కేజీబీవీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మెనూ అమలు, కూరగాయలు, వంట సామగ్రి నాణ్యత, పరిసరాలను పరిశీలించిన డీఈఓ పలు సూచనలు చేశారు. కాగా, బస్వాపురం కేజీబీవీకి నాణ్యమైన కూరగాయలు రావడం లేదని గుర్తించిన డీఈఓ కాంట్రాక్టర్‌ను మందలించడంతో పాటు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఓ, వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మోదుగు శ్యాంసన్, కేజీబీవీ ఎస్‌ఓ కాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అన్నం తినలేకపోతున్నాం సార్..

- జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థినుల ఆవేదన



సమస్యలు తెలుసుకుంటున్న దయానంద్

పెనుబల్లి: ఉడికీ ఉడకని అన్నం తినలేకపోతున్నామని మండలంలోని లంకపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఇక్కడి సమస్యలను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయనంద్ విజయ్‌కుమార్ మంగళవారం పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈమేరకు విద్యార్థినులు తమకు భోజనం, టిఫిన్లు మెనూ ప్రకారం ఇవ్వకపోవడమే కాక నాణ్యత లేకపోవడంతో కడుపు నొప్పితో బాధపడుతున్నామని చెప్పారు. అనంతరం వంటగది, స్టోర్ రూంను తనిఖీ చేసిన దయానంద్ నాణ్యత లేని కూరగాయలు ఉండడంతో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడిగుడ్లు రాకపోతే కాంట్రాక్టర్‌పై ఉన్నతాధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రిన్సిపాల్ స్వరూపరాణిని ఆరా తీశారు. అనంతరం లంకపల్లి శివార్లలో వరి నాట్లు చేస్తున్న మహిళా కూలీలతో ఆయన మాట్లాడి సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకున్నారు. నాయకులు సోమరాజు సీతరామరావు, కీసర శ్రీనివాసరెడ్డి, మామిళ్ల సత్యనారాయణ, మందపాటి వెంకటరెడ్డి, చిన్న స్వామి, పిల్లి నవజీవన్, పోతురాజు కిషోర్, పసుమర్తి చంద్రరావు, చెన్నారావు, పసుమర్తి విశ్వనాథ్ ఉన్నారు.

సొంత నిధులతో మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న వాసు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9, 10 వార్డుల్లో పలురోడ్లకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు మల్లాది సవిత, వాసు దంపతులు వారి సొంత నిధులతో టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో కంకర తోలించి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రక్తదానంతో ప్రాణదానం

మధిర: రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేసినట్లేనని రక్తదానం ఎంతో గొప్పదని మధిర సీఐ మధు అన్నారు. మంగళవారం మధిర సివిల్ ఆస్పత్రిలో లైఫ్ ఆఫ్ గివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... రక్తదానంతో ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ జయదాస్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అద్దంకి రవికుమార్, నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, కోట డేవిడ్, ఆదిమూలం శ్రీనివాసరావు, కోనా నరసింహారావు, దూదేకుల జానీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల ధర్నా

ఏన్కూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరతు మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఎంఈఓ దుగ్గిరాల జయరాజుకు వినతిపత్రం అందేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు, కార్మికులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలి

ముదిగొండ: జీఓ మార్చి అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని జిల్లా రైతు అధ్యక్షుడు మాదినేని రమేష్ అన్నారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనంలో మంగళవారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన రైతుల రుణమాఫీ కాని పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, పయ్యావుల పుల్లయ్య పాల్గొన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5, 6, 7వ తేదీల్లో చేపట్టనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎం.శ్రీనివాస్, ఎం.ప్రసాద్, నాగేశ్వరరావు, హమీద్, రామారావు, సాయి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ఏన్కూరు: చిన్నారులకు క్రమం తప్పకుండ పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి అన్నారు. స్థానిక రైతువేదికలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పాఠ్యాంశాల బోధనపై అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ వెంకటామ్మ, రేఖాభాయి పాల్గొన్నారు.

బదిలీలు సహజమే..

ఏన్కూరు: వృత్తిలో బదిలీలు సహజమేనని హెచ్‌ఎం పాండురంగయ్య అన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయునులకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనిత, అన్నపూర్ణ, చంద్రిక, నిర్మల, సత్యావతి, లతా, నాగమణి, చైతన్య, భారతి, నరసయ్య పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మించాలి

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుచేయాలని, సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించాలని ఐద్వా వైరా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మచ్చా మణి, గుడిమెట్ల రజిత డిమాండ్ చేశారు. మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో సర్వే నిర్వహించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ సునీత, ఏఎన్‌ఎంలు రాధ, కృష్ణకుమారి, మేరీ, ఆశ కార్యకర్తలు మహేశ్వరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదులో పీఆర్‌టీయూ నాయకులు

మధిర: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు కోరారు. పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పీఆర్‌టీయూ సంఘం సభ్యత్వ నమోదు, జనరల్ ఫండ్ క్యాంపెయిన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బదిలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలన్నారు. యూనియన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ వి.రవికుమార్, జి కిరణ్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లంకెల మోహన్ రెడ్డి, డి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు రేగళ్ల బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కొమ్ము శ్రీనివాసరావు, నాయకులు కృష్ణారెడ్డి, శాంతబాబు, జమీర్, శర్మ, లక్ష్మీరాజ్యం, గుల్జార్, అరుణశ్రీ, జ్యోతి కోరారు.

సింగరేణిలో నాణ్యతలేని నిర్మాణాలు

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో సీహెచ్‌పీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని సింగరేణి యాజమాన్యం చెబుతున్నప్పటికీ నిర్మాణాలు మాత్రం నాణ్యత లేకుండా చేపడుతున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య ఆరోపించారు. మంగళవారం సత్తుపల్లి సీహెచ్‌పీఓ గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మికుల రక్షణే జయమని చెబుతున్న యాజమాన్యం సత్తుపల్లిలో మాత్రం పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కరువైందన్నారు. ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఫిట్ సెక్రటరీ ప్రసాద్, నర్సింహారావు, సముద్రాల సుధాకర్, గట్టయ్య, భరణి, రమణమూర్తి, భీమయ్య, సూర్యప్రకాష్, కిషోర్, సుశీల్, సతీష్, శ్రీనివాస్, అజయ్, మహేష్ పాల్గొన్నారు.

సన్మానం

కల్లూరు: కల్లూరు శాంతినగర్‌కు చెందిన కొరకొప్పు వెంకటేశ్వర్లు, నిర్మల దంపతుల కుమారుడు సుమంత్ అమెరికాలోని టెక్సాస్‌లో ఎమ్‌ఎస్‌లో సీటు సాధించగా మంగళవారం శాంతినగర్‌లో ఎంపీటీసీ కొండూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వివిధ సంఘాల ప్రముఖులు, చర్చి ఫాస్టర్లు, ఎంఆర్‌పీఎస్, ఎస్‌డీఎస్, ఎమ్‌ఈఎఫ్, ఐబీసీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వసతుల పరిశీలన

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, గురుకుల పాఠశాలల్లోని మౌలిక వసతులను బీజేపీ మండలాధ్యక్షుడు నూతక్కి నర్సింహారావు, జిల్లా దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. కోటమర్తి సుదర్శనం, నాగేశ్వరరావు, వీరాస్వామి, రీగన్, ప్రకాష్, వెంకట్, పురుషోత్తం, రవీంద్ర, నాగరాజు, రామకృష్ణ, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, రమేష్, గోపాలరావు, అచ్చారావు, మోహన్‌రావు, రాము, కృష్ణయ్య ఉన్నారు.

ఆదాయ అభివృద్ధి పథకాలు చేపట్టాలి

కల్లూరురూరల్: మహిళా శక్తి సంఘాలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలతో జీవనోపాధికి కృషి చేయాలని కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. కల్లూరులోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మహిళా శక్తి సంఘాల ఆదాయ అభివృద్ధి పథకాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలను ఎంపిక చేసి ఫుడ్ ప్రోసెసింగ్, చేతివృత్తులు, చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ ఏర్పాటు చేయాలన్నారు. ఐకేపీ ఏపీఎం వెంకట రామారావు, సమాఖ్య పాలక కమిటీ సభ్యులు సుజాత, శైలజ, ఎస్‌కె షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేంసూరు: మండలంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో పంపిణీ చేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుచ్చాకాయల సోమిరెడ్డి, మండలాధ్యక్షుడు కాసరి చంద్ర శేఖర్‌రెడ్డి అట్లూరి సత్యనారాయణరెడ్డి, రావి సత్యనారాయణ, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, మందపాటి రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని మల్లవరంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కటికి కిరణ్‌కుమార్, ఉపసర్పంచ్ ఎర్రి నరసింహారావు, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి అయినాల రామలింగేశ్వర్‌రావు, ఎంపీటీసీ కటికి భారతమ్మ, కిసాన్‌సెల్ అధ్యక్షుడు క్రిష్టారావు, మేడి సీతారాములు, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని హనుమాన్ తండా, లింగాల, బత్తులపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ కొర్రా రుక్మిని, కొర్రా నర్సింహా, పిచ్చిరెడ్డి, లోకేష్, ఏనుగు సత్యంబాబు, వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ధారావత్ మోహన్ ఉన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



వైరా: నోట్ బుక్స్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కో ఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతులు రెండో వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 3 వ తరగతి చదువుతున్న శ్యామల, ధార్మికలను దత్తత తీసుకున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులు అబ్బూరి రమేష్, శ్రీనివాసరావు, హనుమాయమ్మ, తాటికొండ రాము, బుచ్చి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుబల్లి: మండల పరిధిలోని పలు యూపీఎస్, ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తపది వియం బంజర్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. డిస్ట్రిక్ చైర్‌పర్సన్ లయన్ మిట్టపల్లి జనార్దన్, ఎస్‌కె.అబ్దుల్ సలాం, ప్రెసిడెంట్ శ్రీ ధరాల సుబ్బారావు, సెక్రటరీ మిట్టపల్లి శ్రీధర్, ట్రెజరర్ కారుమంచి ఆనంద్, జయరాం, వెంకటేశ్వరరావు, క్లబ్ బాధ్యులు సుధకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

శానిటేషన్ డ్రైవ్



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

వైరా: వైరా మున్సిపాలిటీలో మంగళవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. వైరా రింగ్ రోడ్డు నుంచి శాంతినగర్ వరకు ఉన్న డివైడర్‌లో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించారు. డివైడర్‌లో పచ్చని మొక్కలు నాటేందుకు ఏర్పాటు చేయాలని అధికారులను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, వార్డు ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానాలు



సత్తుపల్లిటౌన్: పట్టణంలో వేంసూరురోడ్ మెట్టాంజనేయ స్వామి ఆలయం, అయ్యగారిపేటలోని భక్తాంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. బొంతు మాధవరావు, కాల్నేని కాంతారావు, ఎం.వెంకటేశ్వరరావు, మల్లూరు అంకమరాజు, మందపాటి రవీందర్‌రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

చింతకాని: మండలంలోని జగన్నాధపురం మాజీ సర్పంచ్ కోలేటి సూర్యప్రకాశ్‌రావు(60) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన వైస్ ఎంపీపీగా, చింతకాని సొసైటీ చైర్మన్‌గా, గ్రామసర్పంచ్‌గా పనిచేశారు. ఈ మేరకు జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్ రెడ్డి, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ తిరుపతి కిషోర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తుంబూరు దయాకర్‌రెడ్డి, గురిజాల హన్మంతరావు, కిలారు మనోహర్‌బాబు, సీతారామయ్య, గోవిందరావు, బండెల నాగార్జున్, వెంకట్రామయ్య, ఆలస్యం నాగయ్య, కోలేటి రాధ తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

సరిహద్దు వివాదంపై కేసు

వేంసూరు: భూమి సరిహద్దు వివాదంలో మంగళవారం ఒకరిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అటవి రామన్నపాలెం గ్రామానికి చెందిన జూజునూరి వెంకటేష్, జుజునూరి సత్యనారాయణకు భూమి విక్రయించాడు. ఈ మేరకు ఈనెల 21న సరిహద్దు వివాదంలో వెంకటేష్ సత్యనారాయణపై దాడి చేశాడు. సత్యనారాయణ భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



మధిరరూరల్: పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మధిరరూరల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, కమిషనర్ షఫీ ఉల్లా కోరారు. మంగళవారం మధిర మున్సిపాలిటీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి రత్న మనోహర్ ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీకాంత్, గోపి, మహేష్ విజయ్, నీష్మ, పెద్ద పుల్లయ్య, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కిష్టారం ఓసీలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సింగరేణి డిస్పెన్సరీ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శిరీష బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కిష్టారం మేనేజర్ రామకృష్ణ, రక్షణ అధికారి గోపికిషోర్, సంక్షేమ అధికారి సందీప్ పాల్గొన్నారు. మండల పరిధిలోని కాకర్లపల్లిలో గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. ఏఎన్‌ఎంలు పద్మ, మంజుల, అనిత, ఆశ కార్యకర్తలు జయమ్మ, కుమారి ఉన్నారు.



తల్లాడ: బాలపేటలో..



సత్తుపల్లిరూరల్: సింగరేణి డిస్పెన్సరీలో..